## బాసర మాస్టర్ ప్లాన్‌కు
# సీఎం రేవంత్ ఓకే

- రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు
- 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**

బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.



# అభివృద్ధి అద్భుతః అనాలి

**మొదటిపేజీ తరువాయి**

నిబంధనలు కఠినతరం చేయాలని, తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ నెల 6న రూ.225 కోట్లతో బాసర ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. కాగా, సమీక్షలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ కొరడా

**హైదరాబాద్, సిరి న్యూస్‌టుడే:**

హైదరాబాద్ నగరంలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ భారీ స్థాయిలో చర్యలు చేపట్టింది. ఆరు జోన్లలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన షెడ్లు, దుకాణాలను జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తొలగించారు. ట్రాఫిక్ సమస్యలు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో ప్రధాన రహదారుల వెంట ఆక్రమణలను కూల్చివేశారు. శంషాబాద్ సర్కిల్ 18లో రాళ్లగూడ రోడ్ నుంచి బస్టాండ్ వరకు, ఛార్మినార్ జోన్‌లో లాడ్ బజార్ నుంచి పురానాపూల్ రోడ్, రికాబ్ గంజ్ వరకు ఆక్రమణలను తొలగించారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో పిల్లర్ నంబర్ 252 నుంచి 116 వరకు ఇరువైపుల దుకాణ సముదాయాలను తొలగించారు. గోల్కొండ జోన్‌లో జాంబాగ్ హనుమాన్ దేవాలయం నుంచి ఎంజే మార్కెట్ వరకు ఆక్రమణలు కూల్చివేశారు. ఖైరతాబాద్ జోన్‌లో యూసఫ్‌గూడ సర్కిల్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్‌లపై ఉన్న దుకాణాలు, తాత్కాలిక షెడ్లు, వాహనాల పార్కింగ్‌లను తొలగించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆరాంఘర్ వద్ద కూడా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన చిరు వ్యాపారుల దుకాణాలను అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కొంతమంది వ్యాపారుల దుకాణాల్లో సామగ్రి దెబ్బతిన్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారని ఆరోపిస్తూ జాంబాగ్, అఫ్జల్‌గంజ్, మెట్టుగూడ ప్రాంతాల్లో వ్యాపారులు నిరసన తెలిపారు. మోండా మార్కెట్ పోలీస్‌స్టేషన్ వద్ద కూడా ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు వారిని సముదాయించారు. మొత్తం ఆరు జోన్లలో 798 ఆక్రమణలను తొలగించినట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. వీటిలో ఫుట్‌పాత్‌లపై శాశ్వతంగా ఏర్పాటు చేసిన 340 దుకాణాలు, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన 458 దుకాణాలు ఉన్నట్లు వెల్లడించారు.






## గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి

**సిద్దిపేట, సిరి న్యూస్‌టుడే:**

గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. క్యాంప్ కార్యాలయంలోని కిటికీ అద్దాలను ధ్వంసం చేసినట్లు తెలిసింది. ఘటనకు ముందు సీఎం రేవంత్ రెడ్డి ఫోటోతో డీసీసీ ప్రెసిడెంట్ ఆంక్షా రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా బయలుదేరి క్యాంప్ కార్యాలయంలో ఫోటో ఏర్పాటు చేసినట్లు సమాచారం.

క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులే దాడి చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అయితే తాము కార్యాలయంలో సీఎం ఫోటో మాత్రమే పెట్టామని, దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఘటన అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనపై మాజీ మంత్రి హరీష్ రావు స్పందిస్తూ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఇది సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడిగా ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ఇది దాడిగా అభివర్ణించారు. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు పెరుగుతున్నాయని విమర్శించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.



## బీఆర్ఎస్ ఖాతాలో
# ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి

- పట్నం ఛైర్మన్‌గా సుదర్శన్ రెడ్డి ఎన్నిక
- క్యాతన్‌పల్లి ఛైర్‌పర్సన్‌గా సంధ్యారాణి
- రెండుచోట్లా ఎన్నికకు దూరంగా ఉన్న కాంగ్రెస్

**హైదరాబాద్, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**

రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. చైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ చైర్‌పర్సన్‌గా భాజపా కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని కూడా గులాబీ పార్టీ దక్కించుకుంది. ఇక్కడ చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి సంధ్యారాణి, వైస్ చైర్‌పర్సన్ పదవిని సీపీఐ అభ్యర్థి సరిత దక్కించుకున్నారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నికపై కొన్ని రోజులుగా నెలకొన్నఉత్కంఠ ఎట్టకేలకు వీడింది. ఈ ఎన్నికలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికను వాయిదా వేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ 55 రోజులు క్యాంప్ నిర్వహించిందని ఆరోపించింది. ముగ్గురు కౌన్సిలర్లపై కోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నిక నిర్వహించడం సరైనది కాదని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించామని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. దీంతో ఎన్నికల పక్రియ కొనసాగింది. ఈ ఎన్నికలో సుదర్శన్ రెడ్డి చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయగా, కాంగ్రెస్ తరఫున ఆకుల యాదగిరి పేరును ప్రతిపాదించారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను చేతులు ఎత్తే విధానంలో నిర్వహించారు. ఎట్టకేలకు బీఆర్ఎస్ ఈ మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకుంది. గతంలో అనేక విధాలుగా గొడవలకు కారణంగా మారిన క్యాతనపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని అధికారిక కాంగ్రెస్ పార్టీ దక్కించుకోలేకపోయింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ కౌన్సిలర్ గోడిశెల సంధ్యారాణి ఎన్నికయ్యారు. సీపీఐ మద్దతుతో ఆమె చైర్‌పర్సన్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఇక బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. క్యాతనపల్లిలో బీఆర్ఎస్, సీపీఐ పొత్తు పెట్టుకోగా 22 వార్డులకుగాను 10 వార్డుల్లో బీఆర్ఎస్, 4 వార్డుల్లో సీపీఐ అభ్యర్థులు గెలుపొందారు. బీఆర్ఎస్‌సీపీఐ కూటమికి స్పష్టమైన బలం ఉన్నది. కాంగ్రెస్ అభ్యర్థులు ఏడు స్థానాల్లోనే గెలిచారు. కానీ మంత్రి వివేక్, కాంగ్రెస్ నేతల అరాచకాల వల్ల గతంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పక్రియ నిలిచిపోయింది. చివరకు కోర్టు ఆదేశాలతో శనివారం క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించారు. చైర్‌పర్సన్ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు.

## పొంగులేటి మైనింగ్ స్కామ్ దృష్టి మళ్లింపు

- అందుకే తనపై సీఐడీ విచారణ
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**

ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలీసు విధులకు భంగం కలిగించడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన కేసులో.. కౌశిక్ రెడ్డి శనివారం సీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. విచారణ అనంతరం ప్రభుత్వం, పోలీసులపై పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తనను, తన కుటుంబాన్ని రాజకీయంగా వేధించడానికి ఈ విచారణలు జరుపుతున్నారని ఆరోపించారు. సీఐడీ కార్యాలయం వెలుపల మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రస్తుత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను అనని మాటలు అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. పొంగులేటి మైనింగ్ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే నాపై ఎథిక్స్ కమిటీ వేశారు. ప్రజల పక్షాన పోరాడటానికి నేను దేనికైనా సిద్ధం. హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కరీంనగర్ జిల్లా చెత్తనంతా తెచ్చి హుజూరాబాద్‌లో వేస్తే ఊరుకోం. ఆ డంపింగ్ యార్డ్ కరోనా కంటే ప్రమాదం. ఈ



విషయంలో నేను చేస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి విచారణ పేరుతో అడ్డుకుంటున్నారు. ఈ నెల 7వ తేదీన హుజూరాబాద్‌లో దీక్షకు కూర్చుంటా. నేను మత మార్పిడిలపై వ్యాఖ్యలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా' అని అన్నారు.

## మేడారం పూజారి కుమారుడికి పరామర్శ

**వరంగల్, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**

మేడారం గద్దెల వద్ద గతనెల 25న జరిగిన ప్రమాదానికి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి , ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. హన్మకొండలో ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సమ్మక్క పూజారి కుమారుడు యువన్‌ను వారు పరామర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బాలుడికి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. మంత్రి సీతక్క వచ్చి పరామర్శించి రూ. 10వేలు చేతిలో పెట్టి వెళ్లి ఇప్పటి వరకు పట్టించుకోలేదని ఆరోపించారు. మంత్రులు ఇప్పటివరకు బాలుడిని ఆదుకునేందుకు ముందుకు రాకపోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు.

# మెరుగైన పాలన యూడీఎఫ్‌తోనే సాధ్యం

- ఎన్నికల హామీల అమలులో ఎల్డీఎఫ్ విఫలం
- తెలంగాణలో హామీలు అమలు చేస్తున్నాం
- వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ
- కేరళం ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్,, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**



కేరళం రాష్ట్రంలో గొప్ప మార్పు కోసం, మెరుగైన సంక్షేమం కోసం, సుపరిపాలన, సెక్యులర్ పాలన కోసం ఈనెల 9న జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎఫ్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆ రాష్ట్రంలోని పతనంతిట్ట నియోజకవర్గంతోపాటు పలు ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గత ఎన్నికల ముందు ఎల్‌డీఎఫ్ ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. పరిపాలన దారుణంగా పడిపోయిందని, శబరిమల ఆలయంలో కుంభకోణం జరిగిందన్న ఆరోపణలున్నాయని, నిరుద్యోగం భారీగా పెరిగిపోయిందని, పొట్ట చేత పట్టుకొని కేరళం యువత ప్రపంచం నలుమూలలకు వలస పోతుండగా ఇక్కడ వారి సీనియర్ సిటిజన్స్‌కు సరైన సంక్షేమం, ఆదరణ లేకుండా పోయిందని భట్టి విక్రమార్క విమర్శించారు. కేరళం అంటే సెక్యులరిజం, ఉన్నత విద్యావంతులు, గొప్ప మానవీయ కోణం ఉంటుందని అంతా భావిస్తాం కానీ ఈరోజు ఆ తరహా పరిస్థితులు కనిపిం# డంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళం అంటే కమ్యూనిజం, మార్క్సిజం గురించి మాట్లాడతారు కానీ నేడు అది పక్కకు పోయి గూండాయిజం మాత్రమే కనిపిస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌వాదులు శాంతికాముకులు, సుపరిపాలన, సెక్యులరిజాన్ని కోరుకుంటారని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఈ రెండేళ్ల కాలంలో దాదాపు అన్నీ అమలు చేశామని ఆర్థిక మంత్రిగా స్పష్టంగా లెక్కలతో వివరిస్తానని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తుందని, ఎవరికైనా అనుమానం ఉంటే తెలంగాణ రాష్ట్రాన్ని సందర్శించి నివృత్తి చేసుకోవచ్చంటూ ఆయా పథకాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు, విద్యపై ఎక్కువ ఖర్చు చేస్తున్నామని కేరళం సీఎం ప్రకటించుకుంటున్నారు కానీ ఈరోజు తెలంగాణలో విద్యపైన అత్యధికంగా ఖర్చు చేస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను 25 ఎకరాల్లో ఒక్కొక్కటి రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఇక్కడ విద్య, వసతి అన్నీ ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కేరళంలో యూడీఎఫ్‌ను అధికారంలోకి తీసుకొస్తే కాలేజీ విద్యార్థినులకు నెలకు రూ.1000 చొప్పున అందజేస్తామని, స్వయం ఉపాధి కోసం యువతకు వడ్డీ లేకుండా రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు. సామాజిక పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచుతామని, ప్రజల సీఎంగా పేరుగాంచిన కాంగ్రెస్ సీనియర్ నేత ఊమెన్ చాందీ పేరిట వృద్ధుల కోసం రూ.25 లక్షల బీమా పథకాన్ని తీసుకొస్తామని తెలిపారు. ఉపాధి కోసం యూడీఎఫ్ అధికారంలోకి రాగానే సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి వారి సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని, ఇళ్ల వద్ద ఉన్న పెద్దలను జాగ్రత్తగా చూసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

# కేరళలో యూడీఎఫ్ విజయం ఖాయం



**హైదరాబాద్,ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**
కేరళంలో ఈసారి రాజకీయ మార్పు అనివార్యమని, ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. యుడిఎఫ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేరళంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అలెప్పి నియోజకవర్గం మన్నన్చెరీ పంచాయితీలోని కవుంకల్‌లో జరిగిన ఎన్నికల ప్రచారసభలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ గారితో కలిపి పర్యటించిన మంత్రి పొంగులేటి స్థానిక అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఆయనకు మార్పు పట్ల ఉన్న ఆకాంక్ష స్పష్టంగా కనిపించిందన్నారు. కేరళంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇస్తే తెలంగాణలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ మోడల్‌ను అక్కడ కూడా అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యంగా మహిళల సాధికారత కోసం తెలంగాణలో అమలు చేస్తున్నట్లే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కేరళంలో కూడా ప్రవేశపెడతామని ప్రకటించారు. ప్రస్తుతం కేరళంలో ఉన్న సిపిఎం ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి, బీజేపీని కౌంటర్ చేయడం పేరుతో రాజకీయ నాటకాలు ఆడుతోందని మంత్రి విమర్శించారు.ఈ రెండు పార్టీలు కలిసి ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లిస్తున్నాయని ఆయన అన్నారు.ఉద్యోగాల కొరత, ధరల పెరుగుదల, వంటి ప్రధాన సమస్యలను పక్కనబెట్టి, రాజకీయ ఆరోపణలతో కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు.కేరళ ప్రజలు ఇప్పటికే సిపిఎం ప్రభుత్వంపై విసుగు చెందారని, ఈ ఎన్నికల్లో మార్పు కోసం ఓటు వేయాలని నిర్ణయించుకున్నారని మంత్రి తెలిపారు. "ప్రజలకు పారదర్శకత, అభివృద్ధి, సంక్షేమం అందించగల శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉంది. కేరళంలో యుడిఎఫ్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కేరళలో ఈసారి ఎన్నికలు కేవలం ప్రభుత్వ మార్పుకే కాకుండా, ప్రజల భవిష్యత్తు మార్పుకు దారితీసే ఎన్నికలుగా నిలుస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ అరాచకాలను ఓడించిన ప్రజాస్వామ్యం

**మంచిర్యాల, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**
మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల విజయంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలను ఎదిరించి, మున్సిపల్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి సాధించిన ఘనవిజయాన్ని ప్రజాస్వామ్య జయకేతనంగా అభివర్ణించారు. ఆ మున్సిపల్ పీఠాలను బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఎంతో హర్షణీయమన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికైన వారికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన మంచిర్యాల జిల్లా అధ్యక్షు బాల్క సుమన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, పార్టీ యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ (బంటి)తో పాటు, పార్టీ శ్రేణులకు కేటీఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. మున్సిపాలిటీలను దక్కించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, మరెన్ని ఒత్తిళ్లు తెచ్చినా వేటికీ లొంగకుండా, మొక్కవోని దీక్షతో ఒక్క తాటిపై నిలిచిన కౌన్సిలర్ల ధైర్యానికి ఆయన సెల్యూట్ చేశారు. అలాగే క్యాతనపల్లి విజయంలో మిత్రపక్షమైన సిపిఐ కామ్రేడ్లు కనబరిచిన పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అణచివేతకు, బెదిరింపులకు, అవినీతి అక్రమాలకు తావులేదని ఈ ఎన్నికల తీర్పు స్పష్టంగా తేల్చి చెప్పిందని కేటీఆర్ అన్నారు. కేవలం రెండున్నరేళ్లలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజాక్షేత్రంలో కౌంట్ డౌన్ మొదలైందంటూ అటు పంచాయతీ, ఇటు మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టించిన గులాబీ జెండా సైనికులను పార్టీ ఎప్పటికీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ విజయాలు అందించిన స్ఫూర్తితో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అడుగడుగునా విధ్వంసం చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కారుకు రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని కేటీఆర్ హెచ్చరించారు.



## బెడిసికొట్టిన మందుబాబుల ప్లాన్

- **వాట్సాప్ గ్రూప్‌తో తనిఖీలపై ముందే హెచ్చరికలు**
- **ట్రాఫిక్ ఎసఐ ఎంటర్‌తో దొరికిపోయిన మోసం**

**పెద్దపల్లి, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**
డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకునేందుకు మందుబాబులు వేసిన ఒక మాస్టర్ ప్లాన్ డైరెక్టుగా పోలీసులకే దొరికిపోయింది. పోలీసులు ఎక్కడెక్కడ చెకింగ్ చేస్తున్నారో ముందే సమాచారం తెలుసుకునేందుకు వారు ఏకంగా ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. అయితే, ఆ గ్రూప్‌లోకి నేరుగా ట్రాఫిక్ ఎసఐ ఎంట్రీ ఇవ్వడంతో మందుబాబుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. గోదావరిఖని ప్రాంతంలో కొంతమంది మందుబాబులు కలిసి 'పోలీస్ మామల స్క్వాడ' పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్‌ను ప్రారంభించారు. కేవలం ఇద్దరితో మొదలైన ఈ గ్రూప్, చూస్తూనే వేల మంది సభ్యులకు చేరుకుంది. ఈ గ్రూప్ ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే.. పట్టణంలో ఎక్కడైనా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుంటే, వెంటనే ఆ లొకేషన్ వివరాలను గ్రూప్‌లో షేర్ చేయడం. దీనివల్ల మందుబాబులు ఆ మార్గాల్లో వెళ్లకుండా ప్రత్యామ్నాయ దారులను వెతుక్కుని పోలీసుల కళ్లు గప్పేవారు. ఇటీవల వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. అతని సెల్ ఫోన్ తనిఖీ చేయగా ఈ వింత వాట్సాప్ గ్రూప్ వ్యవహారం బయటపడింది. ఆ గ్రూప్‌లోని మెసేజ్‌లను చూసిన స్థానిక ట్రాఫిక్ ఎసఐ, వెంటనే అందులో ఒక సెల్ఫీ వీడియోను పోస్ట్ చేశారు. 'అరేయ్ మామ.. నేను ట్రాఫిక్ ఎసఐని రా మామ.. నా మీదే గ్రూప్ పెడతారా?' అంటూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. 'నేను గోదావరిఖని మున్సిపల్ చౌరస్తాలో చెకింగ్ చేస్తున్నాను, దమ్ముంటే రండిరా మామ చూసుకుందాం' అని సవాల్ విసిరారు.ఆ వీడియోను చూసిన మందుబాబులు ఒక్కసారిగా హడలిపోయారు. వెంటనే గ్రూప్ నుండి లెఫ్ట్ అవ్వడం ప్రారంభించారు. అయితే ఎసఐ మాత్రం తగ్గేదేలే అన్నట్లుగా.. 'ఎవరూ వెళ్ళిపోకండి, మీ అందరి నెంబర్లు సేవ్ చేసుకున్నాను, ఫోటోలు కూడా తీశాను. మీ అందరికీ త్వరలోనే ఒక స్పెషల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ పెడతాను, అందరూ రండి' అని అదిరిపోయే కౌంటర్ ఇచ్చారు. మందుబాబుల 'స్మార్ట్ ప్లాన' పోలీసుల చేతికి చిక్కడంతో ఇప్పుడు గోదావరిఖనిలో ఈ వార్త చర్చనీయాంశంగా మారింది. పోలీసులు సాంకేతికతను వాడుకుని మరీ మందుబాబుల ఆట కట్టించడంతో, ఇప్పుడు ఆ గ్రూప్‌లో ఉన్న సభ్యులంతా పోలీసులకు ఎక్కడ దొరికిపోతామో అని బిక్కుబిక్కుమంటున్నారు.

# రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే దాడి

- **బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తున్న కాంగ్రెస్ నాయకులు**
- **గూండాలతో దాడి చేయించడమేనా ప్రజాపాలన**
- **కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడిని ఖండించిన హరీష్**



**హైదరాబాద్, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**
ఉద్యమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడిని మాజీ మంత్రి, అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందని అన్నారు. ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా? కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులపై, ప్రజా సంఘాలపై, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదు ప్రశ్నించారు. ఒకవైపు హేట్ స్పీచ్ బిల్ పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన.. ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా.. సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేశారా అని నిలదీశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే ఇక్కడ పాలనను ఎవరు చూస్తారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా.. కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా.. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు.. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు అని ఎద్దేవా చేశారు. మీ అణచివేతలకు, మీ నిర్బంధాలకు, మీ దాడులకు బిఆర్ఎస్ పార్టీ అదరదు బెదరదు అని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటాం, ప్రజల తరపున పోరాటం చేస్తూనే ఉంటాం.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర డీజీపీని డిమాండ్ చేస్తున్నామన్నారు .ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుంది.. తస్మాత్ జాగ్రత్త అని హరీశ్ హెచ్చరించారు.

**ప్రజల దృష్టి మరల్చేందుకు దాడులు : నిరంజన్ రెడ్డి**
అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విధ్వంసమే పరమవధిగా కొనసాగుతున్న కాంగ్రెస్ నాయకులు ఈసారి బీఆర్ఎస్ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి చేశారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్‌లోని క్యాంపు కార్యాలయంలోకి చొరబడ్డ కాంగ్రెస్ కార్యకర్తలు విధ్వంసం సృష్టించారని, కేసీఆర్ క్యాంపు కార్యాలయం ప్రభుత్వ ఆస్తి.. దానిని ధ్వంసం చేయడం అంటే ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడమేనని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతగాక ప్రజల దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ఇలాంటి చర్యలను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంపైనే ఇలాంటి చర్యలకు పాల్పడితే ఇక సామాన్యులకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. దుండగులను గుర్తించి కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో పోలీసులు అలసత్వం వహించడం గర్హనీయమన్నారు.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం



**ముంబై, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**
మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబళించింది. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34) తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేనకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ కు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో ఎనిమిది మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

# ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా

- **చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం**
- **జోగు రామన్న హౌజ్ అరెస్ట్**






**నిర్మల్, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**
ఖానాపూర్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం నెలకొంది. అధికారులతో ఎమ్మెల్యే, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. దీంతో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై సందిగ్ధత నెలకొంది. చైర్మన్ ఎన్నిక సందర్భంగా చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులతో ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే సమావేశం నుంచి ఎమ్మెల్యే బయటకు వెళ్లిపోయారు. మరోవైపు మున్సిపల్ కార్యాలయం ఎదుట భాజపా, బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులను ఆయన బెదిరిస్తున్నారని ఆక్షేపించారు. ఇలావుంటే చైర్మన్ ఎన్నిక సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జోగు రామన్నను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆదిలాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లిన పోలీసులు హౌస్ అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి హోంశాఖను తన అధీనంలో ఉంచుకొని ప్రశ్నించే వారిని అక్రమ అరెస్టులు చేయించి జైలుకు పంపడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దాహంతో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారడంతో కుట్రపూరిత చర్యలకు దిగజారడం శోచనీయమని ఆరోపించారు. రాజ్యాంగ నియమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంగా జరగాల్సిన ఎన్నికలు పోలీసుల పహారా మధ్య వారికి అనుగుణంగా మార్చుకునే కుతంత్రాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

# రాష్ట్ర సంపద కొల్లగొడుతున్న రేవంత్

**మొదటిపేజీ తరువాయి**



మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు 66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అడిగినప్పుడు తాను చేసి చూపిస్తానని ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల సంచలన ఆరోపణలు చేశారు.




## సింగరేణి కార్మికులకు శుభవార్త

- **సహజరణానికి కూడా పదిలక్షల బీమా**

**హైదరాబాద్, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికుల సంక్షేమం దిశగా మరో కీలక అడుగు పడింది. సింగరేణి యాజమాన్యం తీసుకున్న ప్రత్యేక చొరవతో, కార్మికులకు లభించే బీమా సౌకర్యం ఇప్పుడు మరింత విస్తృతమైనది. ఇకపై ప్రమాదవశాత్తు జరిగే మరణాలకే కాకుండా, సహజ మరణానికి కూడా రూ. 10 లక్షల ఉచిత బీమా పథకాన్ని అమలు చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. సాధారణంగా బ్యాంకులు ప్రమాద బీమాను మాత్రమే అందిస్తుంటాయి. అయితే, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం యూనియన్ బ్యాంక్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కార్మికులందరికీ జీతాల ఖాతాలు అదే బ్యాంకులో ఉండటంతో, సామాజిక బాధ్యతలో భాగంగా ఈ అదనపు ప్రయోజనాన్ని కల్పించేందుకు బ్యాంక్ అంగీకరించింది.సింగరేణిలో పని చేస్తున్న కార్మికులందరికీ ఇది వర్తిస్తుంది. ఈ నూతన బీమా విధానం ఈ నెల 1వ తేదీ నుండే అమలులోకి వచ్చింది. దీని కోసం కార్మికులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా ఉచితంగా అందించే సేవ. సింగరేణి వంటి కష్టతరమైన వృత్తిలో ఉన్న కార్మికులకు ఈ పథకం పెద్ద అండగా నిలవనుంది. విధి నిర్వహణలో కాకుండా, ఇంటి వద్ద సహజంగా మరణించినా వారి కుటుంబాలకు ఈ 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. ఇది కార్మిక కుటుంబాల్లో భరోసాను నింపుతోంది. సింగరేణి చరిత్రలో ఇలా సహజ మరణానికి కూడా భారీ మొత్తంలో బీమా వర్తించడం ఇదే తొలిసారి అని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. యాజమాన్యం , యూనియన్ బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మికుల నుండి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 4, సిరి న్యూస్‌టుడే:**
హైదరాబాద్ నగరంలో ఫుట్ పాత్ ఆక్రమణలపై జీహెచఎంసీ కొరడా ఝుళిపించింది. ఆరు జోన్లలో ఫుట్ పాత్‌లను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలు, షెడ్లను జీహెచఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. జాంబాగ్ వద్ద ఆక్రమణల తొలగింపు చర్యలను కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పరిశీలించారు. అత్తాపూర్ సర్కిల్ వద్ద రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల కూల్చివేతను అధికారులు చేపట్టారు. ఆరాంఘర్ నుంచి డెయిరీ ఫామ్ చౌరస్తా వరకు అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో రంగంలోకి దిగిన అధికారులు భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. పోలీసులతో యజమానులు వాగ్వాదానికి దిగడంతో ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

# హెల్త్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ఈట్ రైట్, ఎయిడ్స్ పై అవగాహన కల్పించాలి
- యోగ, సేవ్ మదర్స్ డే లాంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలి
- ఈ నెల 06నుండి 11వరకు వారం రోజులపాటు హెల్త్ వీక్ కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ఏప్రిల్ 04 (సిరిన్యూస్)**



హెల్త్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధి కారులను ఆదేశించారు. శనివారం కలెక్ట రేట్లోని సమావేశ మందిరంలో అధికా రులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 06 నుండి 11 వరకు వారం రోజులపాటు హెల్త్ వీక్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. హెల్త్ వీక్ కార్యక్రమంలో భాగంగా జిల్లా, గ్రామీణ స్థాయిలో ప్రజలందరి భాగస్వామ్యం చేయాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని సాధించగలమని,మహిళలు చిన్న పిల్లల అనారోగ్య సమస్యలపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. వివిధ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేసినవారిని తిరిగి చికిత్సను అందించాలన్నారు. ఎయిడ్స్, క్యాన్సర్, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, సి సెక్షన్, ఎనీమియా , మత్తు పదార్థాల నిర్మూలన,లాంటి అనేక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఆరు రోజుల హెల్త్ విక్ కార్యక్రమాలకు నోడల్ ఆఫీసర్లను నియమించాలన్నారు. ఈట్ రైట్, ఎయిడ్స్ పై అవగాహన, యోగ సేవ్ మదర్స్ డే,లాంటి కార్యక్రమాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఈ ఆరు రోజుల కార్యక్రమంలో అధికారులు, మహిళలు, ప్రజలు, విద్యార్థులు, వ్యాపారస్తులు, అందరిని భాగస్వామ్యం చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 6న సోమవారం ఈట్ రైట్ వాక్ ను పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.ఈ వాక్ మున్సిపల్ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, డిసిహెచ్ శివదయాల్, జిల్లా విద్యాధికారి విజయ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివా సరావు, డీఎస్పీ ప్రసన్నకుమార్, డ్రగ్స్ నియంత్రణ అధికారి చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.





# ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**మెదక్ ఏప్రిల్,04(సిరిన్యూస్)**



ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికా రులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ ల తో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఓటర్ల మ్యాపింగ్, బూత్ స్థాయి అధికారుల శిక్షణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి సాధించాలని, బూత్ స్థాయి అధికారులు మ్యాపింగ్ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికా రులకు శిక్షణ అందించాలని, బూత్ స్థాయి ఏజెంట్లకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు శిక్షణ సంబంధిత మెటీరియల్ అందజేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల పోస్టులు ఖాళీగా ఉండకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికా రులను నియమించాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని తెలిపారు.

**మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని మాట్లాడుతూ**

జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సంబంధిత సిబ్బందికి శిక్షణ అందించడం జరిగిందని, జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ ప్రతిష్టంగా నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా కనీసము 50 శాతము మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల దాడి అమానుషం

- ఇది ఇందిరమ్మ రాజ్యమా రేవంత్ రెడ్డి
- గూండా రాజ్యమా అర్థం కాని పరిస్థితి నెలకొంది
- దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజిని రవీందర్ గౌడ్

**తూప్రాల్ ఏప్రిల్ 4 సిరి న్యూస్**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ కెసిఆర్ క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గుండాలు దాడి తచేయడం అమానుషమైన చర్య అని తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజని రవిందర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేత తెలంగాణ రాష్ట్ర ప్రదాత మాజీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై దాడి చేసి ఫర్నిచర్ల ధ్వంసం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నియంత ధోరణికి నిదర్శనంగా కనిపిస్తోందన్నారు తమది ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకునే రేవంత్ రెడ్డి తన గుండా రాజ్యాన్ని నడిపిస్తు న్నాడని విమర్శించారు గడిచిన పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఒక ప్రతిపక్ష నేత క్యాంపు కార్యాలయం పై దాడి చేయడం బాధాకరమన్నారు డిసిసి అధ్యక్షురాలి హోదాలో ఉండి కూడా కాంగ్రెస్ నాయకులను రెచ్చగొట్టి దాడులకు పాల్పడడం ఆంక్ష రెడ్డి కి తగదన్నారు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని రేవంత్ రెడ్డి ఇలా ప్రతిపక్ష ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసుల పైకి కార్యకర్తలను ఉసిగొల్పడం ఆయన గుండా గిరికి నిదర్శనం అన్నారు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడి చేసిన కాంగ్రెస్ గుండాలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు లేనిచో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరగబోయే ప్రజా ఉద్యమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు

# టెండర్ పేరిట కాలయాపన చేస్తే ఉద్యమిస్తాం

**మందమర్రి ఏప్రిల్ 4 సిరి న్యూస్:**



మందమర్రి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఎస్ అండ్ పిసి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోకుండా టెండర్ పేరిట కాలయాపన చేస్తే ఉద్యమం చేపడతామని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం సిఐటియు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డులకు సంబంధించిన టెండర్ గడువు ముగిసి నెలరోజులైన ప్పటికీ, ఇప్పటివరకు కొత్త టెండర్ పిలవకపోవడంతో సుమారు 220 మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులను పలుమార్లు కలిసినా సమస్య పరిష్కారం కాలేదని అసహనం వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా సెక్యూరిటీ కార్మికులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా ఏరియా జీఎం స్పందించి కార్మికులకు తగిన న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# గ్రామ అభివృద్ధికి 20 ఎకరాలు కేటాయించాలి



**(సిరి న్యూస్ )కొండాపూర్ ఏప్రిల్ 4:**

మండల పరిధిలోని మునిదేవునిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 92 లో 294, 17 ఎకరాల అసైన్డ్ భూమిలో 20 ఎకరాల గ్రామ అభివృద్ధికి కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. శనివారం టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సర్వే నెంబర్లు పరిశ్రమలకు కేటాయించిన భూమిలో నుంచి 10% గ్రామ అవసరాలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.భవిష్యత్ తరాలలో గ్రామ జనాభా విస్తరణ దృష్టిలో ఉంచుకుని అదనపు ప్రభుత్వ పాఠశాలలు, మహిళా, యువజన సంఘాల తదితర వంటి భవనాల నిర్మాణాలకు స్థలాలు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. రైతులకు పండించిన వ్యవసాయ పంటల దాన్య నిల్వలకు గోదాముల ఏర్పాటు అవసరముంటుందని చైర్మన్ దృష్టికి తెచ్చారు. సానుకూలంగా స్పందించిన టీజీఐసీ చైర్పర్సన్ ఉన్నత అధికారులతో చర్చించి తమకు అనుకూలమైన తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని వెల్లడించినట్లు వెల్లడించారు. ఈ వినతిలో మాజీ ఎంపీపీ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ లు మల్లారెడ్డి, విఠల్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్న ఆత్మబలిదాన్ దినోత్సవం



**సిద్దిపేట ఏప్రిల్ 4 (సిరి న్యూస్ )**

ఢిల్లీలో జరిగే సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ఆత్మ బలిదాన్ దివాస్ దినోత్సవం కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గంధపు హరి గౌడ్ హాజరయ్యారు ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ పేర్లతో పిలువబడుతున్న గౌడ నేతలు గౌడ సంఘాలు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి ప్రధాన ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి శ్రీపాద నాయకులు మాట్లాడుతూ కలాల్ సమాజం మొత్తం దేశవ్యాప్తంగా ఏకం కావాలని అప్పుడే మన హక్కులు అవకాశాలు సాధించబడతాయని తెలిపారు ఉత్తరప్రదేశ్ పీసీసీ అధ్యక్షులు అజయ్ లల్లు మదియాష్ కి గౌడ్ జగదేవ్ గుత్తేదార్ వీరేందర్ గౌడ్ మధు సత్యం గౌడ్ సత్యం గౌడ్ జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ గుండ్రాతి నారాయణ గౌడ్ గారు మహారాష్ట్ర ప్రెసిడెంట్ సిల్వర్ నారాయణ గౌడ్ గారు ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ శ్రీ చిట్టి బొమ్మ కిషోర్ గౌడ్ గొర్తిపర్తి పరిశరములు గౌడ్ బత్తిని పరశురాములు గౌడ్ తలపల్లి ప్రతాప్ గౌడ్ ముష్మీర్ హరీష్ గౌడ్ తాళ్లపల్లి భాను గౌడ్ తలపల్లి యాద గౌడ్ మెరుగు మహేందర్ గౌడ్ గోనెపల్లి సిద్దేశ్వర గౌడ్ చలో ఢిల్లీ కానిస్టేషన్స్ క్లబ్ లో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ 316 ఆత్మ బలిదాన్ దివాస్ భాగంలో పాల్గొనడం జరిగినది

# పటాన్ చేరు లో దారుణం

- భార్యను కత్తితో హత్య చేసిన భర్త అరెస్ట్
- గేటెడ్ కమ్యూనిటీలో కలకలం...

**రామచంద్రపురం, ఏప్రిల్ 04 (సిరి న్యూస్):**



సంగారెడ్డి జిల్లా పటాన్‌చేరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. పటాన్‌చేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని APR లగ్జూరియా గేటెడ్ కమ్యూనిటీ (ఫేజ్–1), విల్లా నెం.94లో భార్యను కత్తితో హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం... అంబటి లీలావతి (60)ను ఆమె భర్త అంబటి పరమేశ్వర్ రావు అత్యంత దారుణంగా కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిసింది. ఘటన సమయంలో ఇంట్లో కొడుకు, కోడలు లేని అవకాశాన్ని ఉపయోగించుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు సమాచారం.గత కొంతకాలంగా నిందితుడి ప్రవర్తనలో మార్పులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు చెబుతున్నారు. లీలావతిపై పలు చోట్ల కత్తితో దాడి చేసినట్లు ప్రాథమికంగా వెల్లడైంది.ఘటన అనంతరం పరారైన నిందితుడి కోసం గాలింపు చేపట్టిన పోలీసులు, రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయం పరిసర ప్రాంతంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు.ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## తెల్లాపూర్ అభివృద్ధి పనులపై వినతి



**రామచంద్రపురం, ఏప్రిల్ 04 (సిరి న్యూస్):**

తెల్లాపూర్‌లో డ్రైనేజ్ మరియు వీధి దీపాల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎక్స్ ఆర్మీ, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు మల్లెపల్లి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు పటాన్‌చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.ఇండస్ క్రెస్ట్ అపార్ట్‌మెంట్స్ నుంచి ఉర్జిత్ విల్లాస్ వరకు, అలియన్స్ ప్రాంతం మీదుగా తెల్లాపూర్ ప్రధాన డ్రైనేజ్‌కు పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జ్యోతిరావు పూలే కాలనీలో కొత్త డ్రైనేజ్ లైన్ వేయాలని, తెల్లాపూర్ డివిజన్‌లో కొనసాగుతున్న వీధి దీపాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సుబాన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, లక్ష్మా రెడ్డి, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## "రన్ ఫర్ జీసస్" ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించిన ఆదర్శ్ రెడ్డి

**రామచంద్రపురం, ఏప్రిల్ 04 (సిరి న్యూస్):**



లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వరకు నిర్వహించిన "రన్ ఫర్ జీసస్" సువార్త ర్యాలీని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి భారతి నగర్ డివిజన్ ఈఎస్ఐ రోడ్ సమీపంలో జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి ర్యాలీలు సమాజంలో శాంతి, ప్రేమ, సౌహార్దం పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పరమేష్ యాదవ్, పీటర్, జాన్, సురేష్, రాజు, శ్యామ్, అమృత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

### ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**రామచంద్రపురం, ఏప్రిల్ 04 (సిరి న్యూస్):**

జీహెచ్ఎంసీలో ఇటీవల విలీనమైన ముత్తంగి డివిజన్ పరిధిలో ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం డిఎన్ కాలనీ, న్యూ టౌన్ కాలనీలలో పర్యటించిన ఆయన స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు.శిథిలావస్థకు చేరుకున్న సీసీ రోడ్లు, మురికినీటి కాలువలను ఆధునికరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఈఈ సురేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ ఉపేందర్, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

### ఎమ్మెల్యే జీఎంఆర్



**రామచంద్రపురం , ఏప్రిల్ 04 (సిరి న్యూస్):**

పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్లకు చెందిన 75 మంది లబ్ధిదారులకు రూ.30 లక్షల 67 వేల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.అత్యవసర పరిస్థితుల్లో వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందజేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, గడ్డపోతారం మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, పృథ్వీరాజ్, శంకర్ రెడ్డి, శివరాజ్, రాజు, శంకర్, ప్రమోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం దిశగా ప్రభుత్వం అడుగులు

- **అర్హులందరికీ గృహాలు అందించడమే లక్ష్యం**
- **కానుకుంటలో ప్రారంభోత్సవం**
- **సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి**

**గుమ్మడిదల, ఏప్రిల్ 4 (సిరి న్యూస్):**



పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రజల్లో కొత్త ఆశలు నింపుతోంది. ఈ సందర్భంగా కానుకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను గ్రామ సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా ప్రభుత్వ పాలనలో పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సంవత్సరాలుగా సొంత ఇల్లు కోసం ఎదురుచూస్తున్న పేదల ఆశలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలకంగా మారిందన్నారు. ఇందిరమ్మ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గృహ నిర్మాణ సహాయం అందించి, వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ప్రతి అర్హుడికి పారదర్శకంగా ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుం టున్నామని గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా ప్రభుత్వ హామీల ప్రకారం పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలవుతున్నాయని, గృహ నిర్మాణంతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు కూడా ప్రజలకు చేరవేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పథకాల అమలులో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాషా, రామ్ రెడ్డి బావి సర్పంచ్ మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ నీలమ్మ,, మాజీ ఎంపీటీసీ తీగల శంకర్, యాదగిరి, కుమ్మరి వెంకటేష్, బొద్దు వీరేష్, క్యాతం బాల్ రెడ్డి, పోతరాజు సుధాకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు అంజాత్ ఖాన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుబంధు నిధుల విడుదలలో జాప్యం

- **ప్రతి ఎకరాకు నిబంధనలు లేకుండా నిధులు ఇవ్వాలని డిమాండ్**
- **ఆలస్యం కొనసాగితే ఆందోళనలకు హెచ్చరిక**
- **రైతుల పక్షాన బిఆర్ఎస్ నేత గోవర్ధన్ రెడ్డి గళం**

**గుమ్మడిదల, ఏప్రిల్ 4( సిరి న్యూస్ ):**



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, రైతులకు అందాల్సిన రైతుబంధు నిధులను ప్రతి ఎకరాకు ఎటువంటి నిబంధనలు లేకుండా వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గుమ్మడిదల పురపాలక సంఘంలోని సిజిఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాల వల్ల రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో కేసీఆర్ హయాంలో ప్రతి రైతుకు సకాలంలో పెట్టుబడి సాయం అందించారని గుర్తు చేస్తూ, ప్రస్తుతం రైతుబంధు నిధుల విడుదలలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో రైతులు సాగు ఖర్చుల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానంద రెడ్డి, నాయకులు ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మహేష్, జయపాల్ రెడ్డి, దర్గా శీను,రైతులు పాల్గొన్నారు.


# ఏప్రిల్‌లో జన్మించిన ముగ్గురు మహనీయులు

- **సమానత్వానికి మార్గదర్శకులు**
- **బోధన, సమీకరణ, హక్కుల సాధనలో అపూర్వ కృషి**
- **బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పోరాటం**

**గుమ్మడిదల, ఏప్రిల్ 4(సిరి న్యూస్):**







భారత సమాజాన్ని సమానత్వ దిశగా నడిపించిన ముగ్గురు మహనీయులు.బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఏప్రిల్ నెలలో జన్మించడం విశేషం. వీరి ఆలోచనలు, పోరాటాలు భారత సమాజంలో అసమానతలను తగ్గించేందుకు మార్గదర్శకంగా నిలిచాయి. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ రాజకీయ నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ 1908 ఏప్రిల్ 5న జన్మించారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతూ, బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారు. దేశ ఉప ప్రధానిగా సేవలందించి విశిష్ట స్థానాన్ని సంపాదించారు. సమాజంలో విద్యా వెలుగులు ప్రసరింపజేసిన మహాత్మ జ్యోతిరావు పూలే 1827 ఏప్రిల్ 11న జన్మించారు. మహిళల విద్య, దళితుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి అపారమైంది. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలవడానికి ఆయన వేసిన బాట ప్రధాన కారణంగా నిలిచింది. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న జన్మించారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి దేశానికి దిక్సూచిగా నిలిచింది. రాజ్యాంగ రూపకల్పన ద్వారా ప్రతి పౌరునికి హక్కులను కల్పించిన మహనీయుడిగా ఆయన చిరస్మరణీయుడు. ఈ ముగ్గురు మహనీయులు సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు తమ జీవితాలను అంకితం చేశారు. వారి ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగితేనే సమానత్వ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని సూచిస్తున్నారు.

# రామాయంపేటలో బేకరీ, హోటళ్ల పై దాడులు

- **పరిశుభ్రత పాటించని వారికి జరిమానాల విధింపు..**

**రామాయంపేట, ఏప్రిల్ 4(సిరి న్యూస్)**





రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బేకరీ, హోటళ్ల పై మున్సిపల్ శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని బేకరీ, హోటళ్ల నిర్వాహకులకు జారిమానాలు విధించారు, మరి కొంతమందికి నోటీసులు జారీ చేశారు. రామాయంపేట మున్సిపల్ మేనేజర్ రఘువరన్ పర్యవేక్షణలో మున్సిపల్ అధికారులు పట్టణంలోని వివిధ బేకరీలు హోటల్ లను, కిచెన్ లను తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించడం లేదన్న కారణంగా సింగపూర్ బేకరీ కి 5000వేలు ,గోల్డెన్ బేకరీకి 5000 వేలు చొప్పున జరిమానా విధించారు.అదేవిధంగా డైమండ్ హోటల్‌కు 1,000 రూపాయల జరిమానా విధించారు. పట్టణంలోని అన్ని హోటల్ యజమానులు తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, అలా చేయడంలో విఫలమైతే జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. అంతేకాకుండా, పట్టణంలోని అన్ని ఆహారశాలలు నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించాలని వారు నొక్కిచెప్పారు. గడువు ముగిసిన వస్తువులను ఉపయోగిస్తున్నట్లు తేలితే ఏ సంస్థపైనైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలో మున్సిపల్ అధికారులుశ్రీధర్ రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఆరు గ్యారంటీల అమలు ఎక్కడ?
- నియోజకవర్గంలో కుంటుపడుతున్న అభివృద్ధి.
- ప్రజా క్షేత్రంలో ఇక పోరాటాలే..!
- బిఆర్ఎస్ నాయకుడు చౌదరి సుప్రభాత రావు

**రామాయంపేట, ఏప్రిల్ 4(సిరి న్యూస్)**



రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, ప్రజా సమస్యలను గాలికొదిలేసి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ నాయకులు చౌదరి సుప్రభాత రావు మండిపడ్డారు. ఎన్నికల వేళ ఇష్టం వచ్చినట్టు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన పాలకులు, నేడు అమలు విషయానికి వచ్చేసరికి ప్రజలకు మొండిచేయి చూపుతున్నారని విమర్శించారు. శనివారం నాడు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలపై నిప్పులు చెరిగారు.

**ఆరు గ్యారంటీల అమలు ఎక్కడ? అనీ ఆయన ప్రశ్నించారు.**

ఎన్నికల సమయంలో ప్రజలకు రంగురంగుల హామీలు ఇచ్చి, ప్రజలను ఆరు గ్యారెంటీ లతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు వాటిని అమలు చేయడంలో వెనకడుగు వేస్తోందని సుప్రభాత రావు విమర్శించారు. "నేటికీ ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు కావడం లేదు. ఒకవైపు రైతులు పెట్టుబడి సాయం అందక, మరోవైపు సామాన్య ప్రజలు నిత్యావసరాల ధరలతో అల్లాడుతున్నా ప్రభుత్వం మొద్దునిద్ర పోతోంది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను పట్టించుకోని పాలకులకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. మెదక్ శాసనసభ

**నియోజకవర్గంలో రోజు రోజుకు అభివృద్ధి కుంటుపడుతున్నదన్నారు.**

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోయిందని, కానీ ప్రస్తుత పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆయన ఆరోపించారు. గతంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు ఇప్పుడు నిలిచిపోయాయని, కొత్తగా ఎటువంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం కేవలం కాలయాపన చేస్తూ ప్రజలను వంచిస్తోందని విమర్శించారు.

**ప్రజా క్షేత్రంలో ఇక పోరాటాలే శరణ్యమన్నారు.**

ప్రభుత్వ తీరును ఎండగడుతూ బిఆర్ఎస్ పార్టీ తరపున నిరంతర పోరాటం చేస్తామని సుప్రభాత రావు స్పష్టం చేశారు. "మేము ప్రజల పక్షాన నిలబడతాం. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తాం" అని ఆయన పిలుపు నిచ్చారు. బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రజల సమస్యల పరిష్కారం అయ్యే వరకు విశ్రమించబోమని ఆయన పునరుద్ఘాటించారు.

# ప్రజలకు మౌలిక వసతులు కల్పించే బాధ్యత నాది

- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**(సిరి న్యూస్.) మేడ్చల్ మల్కాజ్గిరి ఏప్రిల్ 4**



జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మధురానగర్ లో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కాలనీలో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణం – మరమ్మత్తులు, పారిశుద్ధ నిర్వాహణ, దోమల బెడద, వీధి దీపాల మరమ్మతులు, మంజీరా నీటి ప్రెజర్, స్మశాన వాటికల అభివృద్ధి, సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ల నిర్వహణ, వెజ్ నాన్ వెజ్ మార్కెట్ల ఏర్పాటు, చెరువుల సుందరీకరణ వంటి మౌలిక వసతుల కల్పనపై సమీప కాలనీల వాసులు వారి సమస్యలను విన్నవించారు.ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల కల్పనతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరచామని, రానున్న రోజుల్లో అభివృద్ధి పరుస్తామన్నారు. గ్రామ పంచాయతీ నుంచి కార్పొరేషన్, నేడు జిహెచ్ఎంసి విలీనం వరకు నిజాంపేట్ కార్పొరేషన్ ఎంతో అభివృద్ధి చెందిందని పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధిపరిచి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఉప కమిషనర్ సాబేర్ అలీ, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్ కుమార్, ఎస్.డబ్ల్యూ.ఎం శరన్ తేజ, నిజాంపేట్ సర్కిల్ అధికారులు స్థానిక కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.





# 10 ఏళ్ళు తెలంగాణను దోచుకున్నారు

- లాభ పడింది ఒక్క కేసీఆర్ కుటుంబం మాత్రమే....
- అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెప్పారు..
- బిఆర్ఎస్ పార్టీపై ఎమ్మెల్యే రోహిత్ రావు మండి పాటు..

**రామాయంపేట, ఏప్రిల్ 4 (సిరి న్యూస్)**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక, ప్రజలకు మాయమాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి పది సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని దోచుక తిన్నారని మెదక్ శాసన సభ్యుడు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు విమర్శించారు. శనివారం నాడు మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు మంజూరైన రబ్ధిదారులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద వర్గాల అభివృద్ధి కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలు సద్వినియో గపర చుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చాక అధికారంలోకి వచ్చాక బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రోహిత్ రావు కొనియా డారు.రామయంపేట మండలంలోని కాట్రియాల, వెంక టాపూర్ ఆర్, రాయిలాపూర్,అక్కన్నపేట, పర్వతాపూర్ ,ప్రగతి ధర్మారం, శివాయపల్లి ,ఝాన్సీ లింగాపూర్, కోనాపూర్, కిషన్ తండ, సుతార్ పల్లి, దామరచెరువు ,లక్ష్మాపూర్, తోనిగండ్ల గ్రామానికి చెందిన 84 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్లను ఎమ్మెల్యే రోహిత్ రావు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో షాజీలోద్దీన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి మహేందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ లు గజవాడ నాగరాజు గుప్త, దేవుని రంజిత్, మాజీ కౌన్సిలర్ దేమే యాదగిరి, వివిధ గ్రామాల సర్పంచులు తార్య నాయక్, కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా, బక్కయ్య గారి యాదగిరి, మానేగళ్ళ రామకృష్ణయ్య, వెంకుగారి ఉమా సంజీవరెడ్డి, బన్సీ రాథోడ్, చౌహాన్ రాణి రాజు తో పాటు పలువురు పాల్గొన్నారు.





## బాలానగర్ రహదారిపై ఘోర ప్రమాదం

### దర్గాను ఢీకొన్న బైక్.. వ్యక్తి అక్కడికక్కడే మృతి

**(సిరి న్యూస్ )మేడ్చల్ మల్కాజ్గిరి ఏప్రిల్ 4**



అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ద్విచక్ర వాహనం అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న దర్గాను బలంగా ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన బాలానగర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌతమ్ నగర్ ప్రాంతానికి చెందిన అమితావ్ నాయక్ (35) శనివారం తెల్లవారు జామున తన ద్విచక్రవాహనం (TS08HC5245)పై ఇంటి నుండి కూకట్‌పల్లి వైపు బయలుదేరారు. బాలానగర్ మండల పరిధిలోని ర్యాడ్ క్లిఫ్ స్కూల్ సమీపానికి చేరుకోగానే, వాహనం ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయింది. అతివేగంతో ఉన్న బైక్ పక్కనే ఉన్న దర్గాను బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో అమితావ్ నాయక్‌కు తలకు బలమైన దెబ్బ తగలడంతో ఆయన ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు పంచనామా నిర్వహించిన అనంతరం, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమిక విచారణలో పోలీసులు తేల్చారు. రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటించాలని బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఈ సందర్భంగా వాహనదారులకు సూచించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## రేవంత్ రెడ్డి సారథ్యంలోనే గ్రామాల అభివృద్ధి

### AMC చైర్మన్ మీసం మహేందర్ యాదవ్





**సిద్దిపేట ఏప్రిల్ 4 (సిరి న్యూస్ )**

కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి సారద్యంలోనే గ్రామల అభివృద్ధి సాధ్యంఐతుందని AMC చైర్మన్ మీసం మహేందర్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి, నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ సహకారంతో అల్లీపూర్ గ్రామానికి 10 లక్షల సీసీ రోడ్డు మంజూరు చేసినందుకు ఆయన మరియు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుంబాల మనేమ్మ, ఉప సర్పంచ్ కొలన్ పాక శ్రీనివాస్ రెడ్డి తో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించరన్నారు. గత 6 నెలల ముందు ఇంచార్జ్ మంత్రి సహకారం తో ఐకేపీ సెంటర్ వరకు సీసీ రోడ్డు మంజూరు చేసి పనులు పూర్తి అయినా విషయన్ని గుర్తుచేసారు ఈ కార్యక్రమం లో AMC డైరెక్టర్ నముండ్ల వినోద్, మండల కాంగ్రెస్ ఉప అధ్యక్షులు సందబోయిన పర్శరాం,6వ వార్డ్ మెంబెర్ సునీల్ గ్రామస్తులు చెలిమల రాజిరెడ్డి, వానాకర్ రెడ్డి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు ద్యగల భూమయ్య, ఇర్మల్ల ముత్యం, కోడెల నాగరాజు,కోర్రి శంకర్,ఎర్ర బాలయ్య,కప్పేరా శేఖర్, దుర్గారెడ్డి, మల్లయ్య,దేవయ్య, సురేష్, మల్లయ్య, పర్శరాములు,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కోలన్ హన్మంత్ రెడ్డిని కలిసి కాంగ్రెస్ కమిటీ సభ్యులు



**(. సిరి న్యూస్) మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి ఏప్రిల్ 4**

పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆమోదంతో, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మెడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతనంగా నియమితులైన కాంగ్రెస్ సభ్యులు పార్టీ కోలన్ హనుమంత రెడ్డితన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా సెక్రెటరీ మొహమ్మద్ జాకీర్ , జిల్లా సెక్రటరీ సంతోష్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మాట్లాడుతూపార్టీబలోపేతం, సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యలపై సమిష్టిగా పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి జగన్ ముదిరాజ్ చిన్న రాజు ముదిరాజ్ సజ్జు ఖాన్ రామ్ చందర్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# గాలి అనిల్ కుమార్ కు కాంగ్రెస్ లో కీలక బాధ్యతలు

- నర్సాపూర్, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గాల బీఎల్ఏగా నియామకం

**కొల్చారం ఏప్రిల్ 4( సిరి న్యూస్)**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గాలి అనిల్ కుమార్ కు ఆ పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. నర్సాపూర్, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గాల బూత్ లెవెల్ కోఆర్డినేటర్ గా గాలి అనిల్ కుమార్ ను నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా గాలి అనిల్ కుమార్ కు ఈ రెండు నియోజకవర్గాల్లో గట్టి పట్టుంది. మృదు స్వభావి, కార్యకర్తల కష్టాల్లో వెన్ను దన్నుగా ఉండే నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. దీంతో కాంగ్రెస్ అధిష్టానం ఆయన సేవలను గుర్తించి ఈ మేరకు కీలక బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# దోపిడి దొంగల అరెస్టు




**సిద్దిపేట ఏప్రిల్ 4 (సిరి న్యూస్ )**

గత నెల 29వ రోజున రాత్రి 9.30గంటలకు కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ నకు చెందిన బల్ల సదానందం అనే వ్యక్తి డబుల్ బెడ్ రూమ్ సమీపంలోని కల్లు కాంపౌండ్ దగ్గర నుండి నడుచుకుంటూ తన ఇంటికి వెళ్తుండగా మధ్యలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కలిసి మద్యం తాగుదామని తీసుకెళ్లి ఎవరూ లేని ప్రదేశంలో తనను చేతులతో కొట్టి తన వద్దనున్న సెల్ ఫోను, 500 రూపాయలు మరియు కాలికి ఉన్న వెండి కడియం ను గుంజుకుని పోయినారని సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి ఈరోజు నిందితులు అగుల్ల రాజు తండ్రి సత్తయ్య వయసు 44 సంవత్సరంలు, కులం వీరముష్టి, నివాసం డబుల్ బెడ్ రూమ్ కెసిఆర్ నగర్ మరియు సందమైన రాజు, తండ్రి రాములు వయసు 32 సంవత్సరంలు, కులం యాదవ నివాసం డబుల్ బెడ్ రూమ్ కేసీఆర్ నగర్ వారిని పట్టుకొని వారి వద్ద నుండి ఫిర్యాదు దారుని యొక్క సెల్ ఫోను మరియు వెండి స్వాధీన పరుచుకుని నిందితులను రిమాండు కు తరలించారని సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బి.ఉపేందర్ తెలిపారు

# ఆన్ సైట్ FIR విధానాన్ని అమలు చేస్తున్నాం

## పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట ఏప్రిల్ 4 (సిరి న్యూస్ )**



ప్రజలకు మరింత చేరువగా, వేగవంతంగా మరియు పారదర్శకంగా పోలీస్ సేవలను అందించాలనే లక్ష్యంతో 'ఆన్‌సైట్ FIR' విధానాన్ని అమలు చేస్తున్నామని.పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్. తెలిపారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ... సిద్దిపేట పోలీసు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలను అందించేందుకు "ఆన్‌సైట్ FIR (On-Site FIR / Doorstep FIR)" విధానాన్ని అమలు చేస్తోందని బాధితులు హత్య ప్రయత్నం ,అత్యాచార ప్రయత్నం ,దోపిడీ / చోరీ, మహిళలు చిన్నారులపై నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఎస్సీ ఎస్టీ, బాల్యవివాహాలు, ర్యాగింగ్ వంటి నేరాల్లో బాధితులు పోలీస్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఎక్కడ ఉంటే అక్కడ బాధితుల నివాసం, హాస్పిటల్, రక్షణ ప్రదేశం, సంఘటన చోటుచేసుకున్న ప్రదేశంలోనే పోలీసు అధికారులు FIR నమోదు చేస్తారు. సంఘటన స్థలంలోనే FIR నమోదు చేయడం ద్వారా ఆధారాలు సేకరణ వేగంగా నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందిని ఈ సేవ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు, మహిళలకు, వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీని ద్వారా సమయం ఆదా అవడంతో పాటు, బాధితులకు తక్షణ సహాయం అందుతుందని, ప్రజలు ఎలాంటి సంఘటన జరిగినా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని 'ఆన్‌సైట్ FIR' ద్వారా మీ వద్దకే వచ్చి సేవలు అందిస్తామని ఇది ప్రజల నమ్మకాన్ని పెంచే దిశగా తీసుకున్న కీలక నిర్ణయం. ప్రతి ఒక్కరూ ఈ సేవను వినియోగించుకొని న్యాయం పొందాలని, సిద్దిపేట పోలీసు ప్రజల భద్రత, సౌకర్యమే లక్ష్యంగా మరిన్ని వినూత్న సేవలను అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని సిపి రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ తెలిపారు.

# వాహనాలకు అడ్డంగా బోర్డులు








- షాపుల ముందు వస్తువులు
- వాహనదారులకు ఇబ్బందులు

**నర్సాపూర్ మార్చి 04 (సిరి న్యూస్)**

నర్సాపూర్ పట్టణంలో రోడ్డుకు సమీపంలో బోర్డులు, మట్టి కుప్పలు ఏర్పాటు చేయడంతో వాహనదారులకు ఇబ్బందులుగా మారాయి కొన్ని సమయంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి సంగారెడ్డి రహదారి గుండా రోడ్డుకు పక్కనే మట్టి కుప్పలు బోర్డులు ఇతర వస్తువులు ఉంచడంతో ప్రమాదాలకు గురవుతున్నారు రోడ్డు పక్కన ఆరు అడుగుల దూరములో బోర్లు, ఇతర వస్తువులు ఉంచాలి కానీ రోడ్డు పక్కన కనీసం ఒక ఫీట్ కూడా వదలకుండా రోడ్డు పక్కనే బోర్డులు మట్టి కుప్పలు ఇతర వస్తువులు పెడుతున్నారు వాహనాలు ఓవర్ టెక్ చేసే సమయంలో ఎదురెదురుగా వాహనాలు వస్తున్న సమయంలో రోడ్డు పక్కన వెళ్లలేని స్థితిలో ఉండడంతో వాహనదారుల అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు 15 రోజుల క్రితం పట్టణంలో రుస్తుం పేట్ గేట్ సమీపంలో ఒక ద్విచక్ర వాహన దారుని పై డీసీఎం వాహనం వెళ్లడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించారు పక్కకి మట్టి దిబ్బలు ఉండడం గమనార్హం ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని రోడ్డుకు పక్కన బోర్డులు మట్టి దిబ్బలు ఇతర ఏ వస్తువులను పెట్టకుండా చూడాలని ప్రమాదాలకు నివారించడం కృషి చేయాలని పట్టణ వాసులు. వాహనదారులు వాపోతున్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## నిరుపేదలకు సంక్షేమమే న్యాయం

**( సిరి న్యూస్) కొండాపూర్, ఏప్రిల్4:**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి చేయూతనివ్వడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. శనివారం కొండాపూర్ మండలం గంగారం గ్రామంలో నూతన పంచాయతీ భవనానికి సర్పంచ్ సరిత అశోక్ తో కలిసి భూమి పూజ చేసి, పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన 21 సీసీ కెమెరా లలను, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి అభివృద్ధి సంక్షేమ పథకాలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెచ్చి అర్హులైన ప్రతి ఒక్క లబ్ధారునికి అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పరిపాలనలను ఫ్లెక్సీ లలో, టీవీలలో యాడ్సులు వేసి మైకుల ముందు డబ్బా మాటలు చెప్పారు తప్ప డబుల్ బెడ్ రూములు అందించలేదని విమర్శించారు. నాటి ప్రభుత్వానికి నేటి ప్రభుత్వానికి ప్రజలు గమనించి రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సాధారణ మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు తెలిపిన అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించారన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు హామీలను అమలుపరుస్తూ రూ. 5లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,రూ 500 వంటగ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పావుల వడ్డీ రుణాలు, మహిళా సాధికారత పెంచేందుకు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు కృషి చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీడిసి, ఆత్మ కమిటీ, మార్కెట్ కమిటీ, రామ్ రెడ్డి, ప్రభు, అలవేణి నరసింహారెడ్డి, వార్డు సభ్యులు, ఎంపీడీవో వేణుగోపాల్ మండల నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి నిరంతరాయంగా నీటి సరఫరా లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్
- నీటి సమస్యలపై వార్డులు పరిశీలన
- 12వ వార్డులో తాగునీటి ఇబ్బందులపై ఆరా

**గుమ్మడిదల, ఏప్రిల్ 4 (సిరి న్యూస్):**



వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ స్పష్టంచేశారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ తాగునీటి సరఫరా పరిస్థితులను స్వయంగా పరిశీలించారు.వార్డులోని పలు కాలనీల్లో పర్యటించిన చైర్మన్ ముఖ్యంగా మహిళలతో నేరుగా మాట్లాడి నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి ఒత్తిడి తక్కువగా ఉండటం పైపులైన్ల లీకేజీల కారణంగా సరఫరా అంతరాయం కలుగుతోందని స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ స్పందిస్తూ వేసవి కాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా మున్సిపల్ శాఖ ముందస్తు ప్రణాళికతో పనిచేస్తోందన్నారు. పైపులైన్లలో ఉన్న లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి సమృద్ధిగా నిరంతరాయంగా తాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించడమే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. సమస్యలు ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, సరెడ్డిగారి వెంకట్రామ్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న గులాబీ దళం !

## కేసీఆర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడితో రాష్ట్ర వ్యాప్తంగా కలకలం



- ఇదేనా గౌరవం అంటూ మండిపాటు
- ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణన..
- ప్రతిపక్ష నేతకే రక్షణ లేని దుస్థితి
- సీఎం ఆదేశాలతోనే దాడులంటూ బీఆర్ఎస్ నేతల తీవ్ర ఆరోపణ
- సీఎం రేవంత్ తీరు మార్చుకోవాలని హెచ్చరిక
- శాంతిభద్రతల వైఫల్యంపై గవర్నర్ వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్

**(ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్):**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు జరిపిన దాడి రాష్ట్ర రాజకీయాల్లో పెను తుఫాను సృష్టిస్తుంది. ఈ ఘటన కేవలం ఒక భౌతిక దాడి మాత్రమే కాదని, ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా రాజకీయ విశ్లేషకులు, ప్రతిపక్ష నేతలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలకు తెగించి, నిరాహార దీక్షతో చావు అంచుల వరకు వెళ్లొచ్చిన మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే కార్యాలయంపై దాడికి పాల్పడడంతో బీఆర్ఎస్ శ్రేణులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. సాక్షాత్తు ప్రతిపక్ష నేతకే రక్షణ కల్పించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం, హోం శాఖ ఉండటం అత్యంత శోచనీయమని వారు మండిపడుతున్నారు.

### సీఎం కనుసన్నల్లోనే విధ్వంసకాండ ?

రాష్ట్రంలో గత కొంతకాలంగా ప్రతిపక్ష నాయకులు, ప్రజా సంఘాలు, నిరుద్యోగులు, మీడియా ప్రతినిధులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గజ్వేల్ దాడి వెనుక నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు ఉన్నాయని, ఆయన ప్రోత్సాహంతోనే కాంగ్రెస్ శ్రేణులు బరితెగిస్తున్నాయని ప్రతిపక్ష నేతలు నిప్పులు చెరుగుతున్నారు. ప్రజలకు ఇచ్చిన సంక్షేమం, అభివృద్ధి హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వం, తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారి గొంతు నొక్కేందుకు ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూ రాష్ట్రంలో గూండా రాజ్యాన్ని నడుపుతున్నారని, రేవంత్ రెడ్డి వెంటనే తన పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో తగిన బుద్ధి చెబుతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

### ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు..

రాష్ట్రంలో అరాచక శక్తులు పెచ్చుమీరుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట అని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత స్థాయి నాయకుడి కార్యాలయంపైనే పట్టపగలు ఇలాంటి విధ్వంసం జరిగితే, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణలో హోం శాఖ పూర్తిగా విఫలమైందని, పోలీసులు అధికార పార్టీకి అనుబంధ విభాగంలా వ్యవహరించడం మానుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి తన అధికారాన్ని కేవలం ప్రతిపక్షాలను అణచివేయడానికి, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి ఉపయోగిస్తుండటం ప్రజాస్వామ్య వ్యవస్థలకే గొడ్డలిపెట్టు అని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

### గవర్నర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్...

ఈ క్రమంలో రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ, అప్రజాస్వామిక పరిస్థితులపై గవర్నర్ వెంటనే జోక్యం చేసుకోవాలని బాధితులు, రాజకీయ నేతలు కోరుతున్నారు. గజ్వేల్ క్యాంపు కార్యాలయం దాడిపై ఉన్నత స్థాయి సమగ్ర దర్యాప్తు జరిపించి, దాడికి పాల్పడిన వారితో పాటు వారి వెనుక ఉండి నడిపించిన సూత్రధారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడలేని ఈ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తారని హెచ్చరించారు. ఈ ఘటనతో గజ్వేల్‌లో యుద్ధ వాతావరణం నెలకొనగా, రాష్ట్రవ్యాప్తంగా నిరసన సెగలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి.

## నీటి కొరత నివారణకు బోర్లు ఏర్పాటు

**సిరిన్యూస్, తాండూర్:** బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా తాండూర్ గ్రామంలో నీటి కొరతను నివారించేందుకు బోర్లు ఏర్పాటు చేశారు. తాండూర్ సర్పంచ్, ఉప సర్పంచ్ ఇచ్చిన హామీ మేరకు తాండూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. శనివారం తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అశోక్ నగర్ మేదరివాడ కొత్త గుడిసెల వద్ద నివసిస్తున్న ప్రజలకు ఎండా కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా బోర్లు వేయించి మోటర్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీఓ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి దివాకర్, తాండూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, 6వ వార్డు సభ్యుడు పట్టెం విష్ణు కళ్యాణ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మంతెన శివకృష్ణ, నాయకులు పురంశెట్టి అరుణ్, కోరల్ల శంకర్, నియాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## సెన్సస్ లో ఉపాధ్యాయుల ఎంపిక సీనియార్టీ ప్రకారం జరగాలి



**సిరిన్యూస్ తాండూర్:** సెన్సస్–2027లో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకాల్లో ఉపాధ్యాయుల ఎంపికను సీనియార్టీ ప్రాతిపదికన చేపట్టాలని కోరుతూ తపస్ తాండూర్ మండల శాఖ ప్రతినిధులు మండల తహశీల్దార్ జ్యోత్స్నకు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెన్సస్ పనుల్లో పారదర్శకత కోసం ఉపాధ్యాయుల ఎంపికను సీనియార్టీ ఆధారంగా చేయాలని కోరారు. దీనిపై తహశీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర నాయకులు విద్యాసాగర్, ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి భారతీ అశోక్, మండల బాధ్యులు వరప్రసాద్, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు

### రహదారి విస్తరణ పనులు ప్రారంభం

**సిరిన్యూస్, కాగజ్‌నగర్:** జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. శనివారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఓల్డ్ రైల్వే గేట్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగిస్తూ రహదారి విస్తరణ చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో వారు స్వచ్ఛందంగా తమ ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో మున్సిపల్ అధికారులు స్వయంగా కూల్చివేత చర్యలు చేపడతారని హెచ్చరించారు. పట్టణ అభివృద్ధి దృష్ట్యా చేపట్టిన ఈ చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు.

## గజ్వేల్‌లో కేసీఆర్ క్యాంపు కార్యాలయం ముట్టడి !

- ర్యాలీగా వెళ్ళి సీఎం చిత్రపటం ఏర్పాటు
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయాలని డిమాండ్
- కేసీఆర్ స్పందించకుంటే ఎర్రవల్లి ఫామ్ హౌజ్ ముట్టడిస్తాం
- డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి



**గజ్వేల్, ఏప్రిల్ 4(సిరిన్యూస్) :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని కేసీఆర్ క్యాంపు కార్యాలయాన్ని కాంగ్రెస్ నేతలు ముట్టడించడంతో తీవ్ర కలకలం రేగింది. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అంక్షారెడ్డి ఆధ్వర్యంలో శనివారం పార్టీ శ్రేణులు క్యాంపు కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని కార్యాలయంలో బిగించి బిఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ ఇప్పటికే రూ.1.20 కోట్ల వేతనం, ఇతర అలవెన్సులు పొందుతూ ప్రజలకు సేవ చేయని ఆయనను వెంటనే ఎమ్మెల్యే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండని కెసిఆర్ ఒక్క క్షణం కూడా ఎమ్మెల్యేగా కొనసాగే నైతిక హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ అందుబాటులో ఉండకపోవడంతో కళ్యాణ లక్షి , షాది ముబారక్ చెక్కులు పంపిణీ నిలిచిపోయినట్లు ఆరోపించారు. అంతకుముందు గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కేసిఆర్ క్యాంపు కార్యాలయం వద్దకు ర్యాలీ నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని బిగించడంతో పాటు ధర్నా, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి, కనకయ్య గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, వందలాది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### దాడికి నిరసనగా రేపు గజ్వేల్ బంద్..

**- బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి**

గజ్వేల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ గుండాలు దాడి చేశారంటూ గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను కఠినంగా శిక్షించాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన వారిని 24 గంటల్లోగా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని విమర్శించారు. సోమవారం దాడికి నిరసనగా ప్రజాస్వామ్యబద్ధంగా గజ్వేల్ బంద్‌కు పిలుపునిస్తున్నామన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు.

### కేవలం సీఎం చిత్రపటమే పెట్టాం...

**మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి**

గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి జరిగినట్లు తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆస్తిగా ఉన్న క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటం లేకపోవడం గమనించి తమ పార్టీ కార్యకర్తలు అక్కడికి వెళ్లి చిత్రపటాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్యాంప్ కార్యాలయం ప్రభుత్వానికి చెందినదని, అక్కడ సీఎం చిత్రపటం ఉండటం సహజమని తెలిపారు. మా కార్యకర్తలు వెళ్లి గౌరవంగా సీఎం చిత్రపటాన్ని పెట్టి వచ్చారు తప్ప అక్కడ ఎలాంటి దాడులు, విధ్వంసం జరగలేదని స్పష్టం చేశారు. కావాలనే కొందరు ఈ సంఘటనను వక్రీకరించి దాడిగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని నర్సారెడ్డి ఆరోపించారు. ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకుని తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, నిజానిజాలు బయటపడేలా చూడాలని నర్సారెడ్డి కోరారు.

## ఆన్‌లైన్ బుకింగ్‌తో పారదర్శకంగా ఇసుక సరఫరా

### తహశీల్దార్ మారుతి రెడ్డి

**సిరిన్యూస్, గంభీరావుపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "తెలంగాణ మన ఇసుక వాహనం" పథకం ద్వారా ఇసుక సరఫరాను పారదర్శకంగా, సులభంగా అందుబాటు ధరల్లో అందించడం జరుగుతుందని తహశీల్దార్ మారుతి రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలు మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకునే సౌకర్యం ఉందని పేర్కొన్నారు. దీంతో అక్రమ ఇసుక రవాణా తగ్గడమే కాకుండా వినియోగదారులకు ఇసుక అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేసిన వాహనాల ద్వారా ఇసుకను నేరుగా




వినియోగదారుల ఇంటి వద్దకు పంపించడం జరుగుతుందని,. దీంతో ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయని అనానరు. ఇసుక బుకింగ్ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారిక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని, https://tsmiv.cgg.gov.in ద్వారా సులభంగా బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ప్రజలు తప్పనిసరిగా అధికారిక వెబ్‌సైట్ ద్వారానే ఇసుకను బుక్ చేసుకోవాలని సూచించారు. అనధికారిక వ్యక్తులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని తెలిపారు. ఎవరైనా అధిక ధరలు వసూలు చేసినా, అక్రమ ఇసుక రవాణా గమనించినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ పథకం ద్వారా సహజ వనరుల సంరక్షణతో పాటు సమానంగా ఇసుక పంపిణీ చేయడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.